అధికారుల నిఘా లోపం..
కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం

- సంవత్సరం గడుస్తున్నా పూర్తికాని బీటీ రోడ్డు
- పొల్యూషన్, ప్రమాదాల బారిన ప్రజలు

హయత్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీలో అధికారుల నిఘా లోపం అభివృద్ధి పనులకు శాపంగా మారింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రారంభించిన రోడ్డు పనులు నేటికి నిర్మాణానికి నోచుకోలేదు. దాదాపు సంవత్సరం గడుస్తున్నా రోడ్డు నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. దీంతో కాలనీల ప్రజలు దుమ్ము, దూళి, గుంతలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొందరు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా అధికారులు, కాంట్రాక్టర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023 అసెంబ్లీ ఎన్నికలకు నెల రోజుల ముందు మునగనూరు ఎస్‌బీహెచ్ బ్యాంకుకాలనీ కమాన్ నుంచి మునగనూరు టెలిఫోన్‌కాలనీ పోచమ్మగుడి వరకు రోడ్డు విస్తరణ, బీటీ రోడ్డు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కిలోమీటరు వరకు రోడ్డును నిర్మించేందుకు తెలంగాణ పట్టణ ఆర్థిక వనరులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్(టీయూఎఫ్ఐడీసీ)నుంచి రూ.కోటి20 లక్షలు మంజూరు అయ్యాయి. రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. సంవత్సరం గడుస్తున్నా నేటికీ రోడ్డు పనులు పూర్తి కాలేదు. రెండు నెలల క్రితం కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా వెట్‌మిక్స్ వేసి వదిలివేశాడు. ఆ తర్వాత కాంట్రాక్టర్ మరో చోట పనులు చేసేందుకు వెళ్లాడు. దీంతో రోడ్డు దుమ్మురేగుతుంది. అక్కడక్కడ గుంతలుపడ్డాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.


మునగనూరు ఎస్‌బీహెచ్‌కాలనీలో కంకరతేలి అధ్వానంగా ఉన్న రోడ్డు పరిస్థితి

దుమ్ముతో వేగలేకపోతున్నాం



విస్తరించిన రోడ్డుపై వెట్ మిక్స్ చేసి వదిలిన తర్వాత అందులో నుంచి వాహనాలు వెళ్లడంతో తీవ్రంగా దుమ్ము పైకిలేస్తుంది. రోడ్డుపైన నడవలేకపోతున్నాం. కంట్లో దుమ్ము పడుతుంది. ఎస్‌బీహెచ్ బ్యాంక్‌కాలనీ మొత్తం దుమ్ముతో నిండింది. రోడ్డుపైన ఇళ్లు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము వల్ల ఆస్తమా లాంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని భయమేస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తిచేయాలి

- నవీన్, మునగనూరు

డ్రైనేజీ పనులు పూర్తికాగానే రోడ్డు పనులు చేస్తాం

మునగనూరు ఎస్‌బీహెచ్‌కాలనీలో డ్రైనేజీ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సావిత్రమ్మ ఇంటి నుంచి ఉదయ్‌శంకర్ ఇంటి వరకు డ్రైనేజీ నిర్మాణం కోసం ఇటీవల రూ.10లక్షలు మంజూరు అయ్యాయి. టెండర్ కూడా అయింది. త్వరలో పనులు పూర్తి అవుతాయి. ఆ వెంటనే రోడ్డు పనులు పూర్తి చేస్తాం.

- చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఈ, తుర్కయంజాల్ మున్సిపాలిటీ

రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయాలి



మునగనూరు ఎస్‌బీహెచ్‌కాలనీ కమాన్ నుంచి టెలిఫోన్‌కాలనీ వరకు సంవత్సరం క్రితం చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు మరుగున పడ్డాయి. దుమ్ము రేగుతున్న రోడ్డు, పొల్యూషన్ వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధికారులు, కాంట్రాక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రోడ్డును పూర్తిచేయాలి.

- సంగీత మోహన్‌గుప్తా, 1వార్డు కౌన్సిలర్, తుర్కయంజాల్

రోడ్డు సరిగా లేక.. ఆర్టీసీ బస్సు బంద్



రోడ్డు సరిగా లేకపోవడంతో ఆర్టీసీ అధికారులు ఎస్‌బీహెచ్ బ్యాంకు కాలనీకి బస్సును బంద్ చేశారు. రోడ్డును వేయించండి బస్సును పంపిస్తామని ఆర్టీసీ అధికారులు అంటున్నారు. బస్సు ఎక్కడానికి ప్రజలు నడుచుకుంటు మునగనూరు ప్రధాన రోడ్డుకు రావాల్సి వస్తుంది. గుంతలమయంగా మారిన రోడ్డులో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనం దారులు పడి తీవ్రగాయాలకు గురి అవుతున్నారు. కిలోమీటర్ రోడ్డు అధ్వానంగా మారింది, దుమ్మును భరించలేకపోతున్నారు.

- ఉమర్‌ఖాన్, మాజీ అధ్యక్షుడు, ఎస్‌బీహెచ్‌కాలనీ


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

చంపాపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంజూరు చేయించి శనివారం అందజేశారు. హస్తినాపురం డివిజన్ ఇంద్రప్రస్తకాలనీకి చెందిన దానమ్మ గత కొంత కాలంగా వెన్నుముకకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతుంది. వారి పేదరికం కారణంగా ఆర్థిక సహాయం కోసం ఎమ్మెల్యేను సంప్రదించారు. ఆయన చొరవ చూపించి దానమ్మకు రూ.2లక్షల సీఎం రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేయించారు. సదరు సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ చెక్కును బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవి ముదిరాజ్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో టీజీఏఎన్‌బీ డీఏస్పీ రమేష్‌బాబు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు

డ్రగ్స్‌ను దరిచేరనీయొద్దు : టీజీఏఎన్‌బీ డీఏస్పీ

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్‌లోని పల్లవి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం యాంటీ నార్కోటిక్స్ డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీజీఏఎన్‌బీ డీఏస్పీ రమేష్‌బాబు, ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఏస్పీ మాట్లాడుతూ ముఖ్యంగా యువత డ్రగ్స్ బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఆల్కహాల్, స్మోకింగ్, డ్రగ్స్ తదితర వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా డ్రగ్స్, గంజాయి తీసుకున్నట్లు దృష్టికి వస్తే వెంటనే 1908, 8712671111 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మల్కా నవీన్ కుమార్, డైరెక్టర్ డాక్టర్ రామశేషగిరిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ రాజు, హెచ్‌వోడీ, అధ్యాపక బృందంతో పాటు 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అవంతిలో ముగిసిన టెక్‌ఫెస్ట్

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గుంతలపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన రెండు రోజుల టెక్ ఫెస్ట్ శనివారం ముగిసింది. రెండవ రోజు ఫెస్ట్‌లో విద్యార్థులు మరిన్ని నమూనాలను రూపొందించి ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, అవంతి పూర్వ విద్యార్థి, యూస్ నాసా సైంటిస్ట్ జాహ్నవీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫెస్ట్‌లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు అతిథులతో కలిసి కళాశాల చైర్మన్ అవంతి శ్రీనివాస్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుధాకర్, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ రవిప్రసాద్, శ్రీకాంత్‌కోర్ల, కిరణ్‌కుమార్, కళాశాల డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ రాంచంద్రారెడ్డి, ఉమామహేశ్వరరావు, క్యాంపస్ ఇన్‌చార్జి బోసు, పీఆర్‌ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు

చంపాపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలో శనివా రం సుబ్రహ్మణ్య షష్టి సందర్భం గా వేద పండితులు, అర్చకులు సుబ్రహ్మణ్యస్వామి విశేష అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. లావణ్య ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ సిబ్బంది వెంకటయ్య, రమాదేవి, వేణుగోపాల్, అర్చకులు మురళీధర్‌శర్మ, శ్రవణ్‌కుమార్‌శర్మ, ప్రవీణ్‌కుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ కాశీ వైద్యనాథ ఆలయంలో..

ఎల్‌బీనగర్ : సుబ్రహ్మణ్య షష్టిని పురస్కరించుకుని శనివారం సరూర్‌నగర్‌లో బంగారు మైసమ్మ కాశీ వైద్యనాథ ఆలయంలో ప్రత్యేక పూజాధికాలతో పాటు పాలకావడి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీలు బేర బాలకిషన్, ఆకుల అరవింద్‌కుమార్‌ల ఆధ్వర్యంలో భక్తులు పాలకావడి మోస్తు సరూర్‌నగర్ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు బాలాగంగాధరశర్మ, చంద్రశేఖరశర్మ, దర్శిల్‌శర్మ, సీతారాం పండిత్ పాల్గొన్నారు.

'ప్రభుత్వ కార్యాలయాల్లో మోదీ ఫొటో ఏర్పాటు చేయాలి'

సరూర్‌నగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దేశ ప్రధాని నరేంద్రమోదీ ఫొటో(చిత్రపటం) ఏర్పాటు చేయాలని బీజేవైఎం బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు ఆర్.రామృష్ణారెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం ఆయన కమిషనర్ సరస్వతిని ఆమె ఛాంబర్‌లో కలిసి మోదీ ఫొటోతో పాటు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.25లక్షలేనా?

- పుష్ప చిత్ర బృందంపై వీఆర్‌పీ ఆగ్రహం


పుష్ప-2 చిత్రబృందం, ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వీఆర్‌పీ నాయకులు

మన్సూరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పుష్ప-2 చిత్రం చూసేందుకు ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్‌కు వెళ్లి అక్కడ జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన అభిమానురాలు రేవతికి రూ.25లక్షలు మాత్రమే ప్రకటించిందంటూ చిత్ర బృందంపై, నిర్లక్ష్యంగా వ్యవహరించిందంటూ రాష్ట్ర ప్రభుత్వంపై విద్యార్థుల రాజకీయ పార్టీ(వీఆర్‌పీ) నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు నాగోల్‌లోని అలకాపురి సిగ్నల్ వద్ద శనివారం పుష్ప-2 చిత్ర బృందం, కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మృతురాలు రేవతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, అదేవిధంగా పుష్ప-2 చిత్రబృందం రూ.కోటి ఆర్థిక సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇజ్జగిరి, కమలాకర్, అనిల్ గోకికర్, నందల అనిల్‌కుమార్, మహేష్ భాగవతుల, యెచ్చు అనిల్‌కుమార్, పాక నవీన్‌బాబు, ఎడ్ల నరేష్, ఎండీ రషీద్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విప్లవ పార్టీ సీపీఐ : యాదిరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య విప్లవ పార్టీ సీపీఐ అని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. శనివారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ రాజీవ్ గృహకల్పలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి పక్షాన నిత్యం పోరాటాలు చేస్తూ సమస్యల పరిష్కారానికి సీపీఐ కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, స్థానిక కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, సహాయ కార్యదర్శి హజ్మీర్ హరిసింగ్‌నాయక్, రాములు, యాదయ్య, బాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి మాలలో ఆరోగ్యసూత్రాలు

- పీసీసీ ప్రతినిధి భాస్కర్‌రెడ్డి


ఆంజనేయస్వామి పూజా మహోత్సవంలో భాస్కర్‌రెడ్డి

ఎల్‌బీనగర్ : ఆంజనేయస్వామి మాలలో ఆధ్యాత్మిక చింతనతో పాటు ఆరోగ్య సూత్రాలు కూడా దాగి ఉన్నాయని పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్‌లో ఆలేటి కిరణ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆంజనేయస్వామి పూజా మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్‌రెడ్డి, గట్ల రవీందర్, ఖిల్లా మైసమ్మ ఆలయ డైరెక్టర్ శ్రీశైలం, కళ్యాణ్‌యాదవ్, సూర్య, చంద్ర, వెంకట్ పాల్గొన్నారు.

త్వరలోనే దివ్యాంగులకు పింఛన్ల పెంపు: సీతక్క

సైదాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): త్వరలోనే దివ్యాంగులకు పింఛన్లు పెంచుతామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం మలక్‌పేటలోని బధిరుల ఆశ్రమ పాఠశాల, సరూర్‌నగర్‌లోని వికలాంగుల హాస్టల్, మాసబ్‌ట్యాంకులోని అంధుల గృహంలో మంత్రి సీతక్క, కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యతో కలిసి విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పింఛన్లు నేరుగా వారి బ్యాంకు అకౌంట్లలో వేసేందుకు సానుకూలంగా ఉన్నామని తెలిపారు. మూగ, చవిటి విద్యార్థులకు ప్రస్తుతం పదో తరగతి వరకే పాఠశాలలు ఉన్నాయని, ఇంటర్ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. దివ్యాంగుల హాస్టళ్లలో చదువుకుంటున్న 16మంది ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. దివ్యాంగుల హాస్టళ్లలో సిబ్బంది కొరత, ఇతర సమస్యలను తొందరలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితారామచంద్రన్, వికలాంగుల శాఖ డైరెక్టర్ శైలజ. అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క

మేమిచ్చిన చెక్కులే మీరిస్తున్నారు.. తులం బంగారం ఏదీ?

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడపిల్లలను ఆదుకునేందుకు ఒక అన్నగా మాజీ సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకం ప్రవేశపెట్టారని, నాటి పథకాన్నే ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు కొనసాగిస్తున్నారని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం తులం బంగారం ఎప్పుడు ఇస్తారని ఆమె ప్రశ్నించారు. 'మేమిచ్చిన చెక్కులే మీరూ ఇస్తున్నారు. ఇందులో కొత్తేం ఉంది.. చేతనైతే, ఆడపిల్లలపై నిజంగా ప్రేమ ఉంటే హామీ ప్రకారం తులం బంగారం కలిపి ఇవ్వండి' అని ఆమె సవాల్ విసిరారు. శనివారం బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఆయా కార్పొరేషన్లలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ ఏడాది కాలంగా ఎన్ని చెక్కులు ఇచ్చారో వారందరికీ తులం బంగారం ఇవ్వాల్సిందేనని అన్నారు. చెక్కులు ఇచ్చి చేతులు దులుపుకుంటే చూస్తూ ఊరుకోబోమని, దీనిపై ఆడపిల్లలతో కలిసి ఆందోళనలు చేపడతామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో మేయర్లు చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి, దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్లు ఇబ్రాం శేఖర్, తీగల విక్రమ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్లు సూర్లగంటి అర్జున్, అర్కల భూపాల్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, మేయర్ పారిజాతారెడ్డి, డిప్యూటీ మేయర్ శేఖర్

యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సందీప్‌రెడ్డి



సరూర్‌నగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడకు చెందిన కొంతం సందీప్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో లభించిన పదవికి న్యాయం చేస్తానని ఆయన పేర్కొన్నారు.

బాలాపూర్ మండల అధ్యక్షుడిగా రవికాంత్‌రెడ్డి

సరూర్‌నగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ బాలాపూర్ మండల కమిటీ అధ్యక్షుడిగా బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడకు చెందిన పర్వతి రవికాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ కమిటీ పాత అధ్యక్షుడితో పాటు పార్టీలోని అన్ని స్థాయిల నాయకులను, కార్యకర్తలను కలుపుకుని పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని ఆయన చెప్పారు.

ఎంకేఎం మాక్స్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఇందూరి లత

సైదాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మున్నూరు కాపు మహిళా పరస్పర సహాయ సహకార సంఘం(ఎంకేఎం మాక్స్) రాష్ట్ర డైరెక్టర్‌గా మలక్‌పేట నియోజకవర్గానికి చెందిన ఇందూరి లత తిరుపతి పటేల్ ఎన్నికయ్యారు. నియామకపత్రాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాస్, సంఘం సీఈఓ పుటం పురుషోత్తంరావులు అందజేశారు. ఈ సందర్భంగా లత మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతుల వద్ద పంటలను కొని వినియోగదారులకు కల్తీలేని సరుకులు అందించడం లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు.


విద్యార్థులతో కలిసి గేటును ప్రారంభిస్తున్న దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

విద్యార్థుల భద్రతకు మరో గేటు

- జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బహదూర్‌గూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల భద్రత కోసం పాఠశాల వెనుక వైపు మరో గేటు ఏర్పాటు చేసినట్లు జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని బహదూర్‌గూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నూతన గేటును శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జైరాం, శ్రీనివాస్, అస్లాం, నాయకులు జైపాల్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, సుధీర్, యశ్వంత్, మనోజ్, విష్ణు, వసంత, రాజేశ్వరి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల బలోపేతానికి తోడ్పాటునందించండి

- నిర్వీర్యం చేసే పరిస్థితులు కల్పించవద్దు
- 2012-2023లో జరిగిన అవినీతి అక్రమాలపై సీఎం విచారణకు ఆదేశించాలి
- గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగ జేఏసీ నేతలు


సమావేశంలో గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగ జేఏసీ నేతలు

ఎల్‌బీనగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల బలోపేతానికి తోడ్పాటునందించండి కానీ, నిర్వీర్యం చేసే పరిస్థితులు కల్పించవద్దంటూ రాజకీయ పార్టీల నేతలకు, విద్యార్థి సంఘాలకు గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగ జేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు. శనివారం అల్కాపురి చౌరస్తాలోని గురుకుల జేఏసీ కేంద్ర కార్యాలయంలో ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. గతంలో (2012-2023) జరిగిన అవినీతి అక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశిస్తే సాక్షాలతో సహా నిరూపించడానికి గురుకుల జేఏసీ సహకరిస్తుందని ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 300లోపు ఉన్నటువంటి గురుకులాలు, తెలంగాణ ఏర్పడ్డ తర్వాత 1023 గురుకులాలు ఏర్పాటయ్యాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాలలో ఆరు లక్షల మంది పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు చదుతున్నారని తెలిపారు. దురదృష్ట వశాత్తు ప్రభుత్వ గురుకులాలలో చిన్నచిన్న సంఘటనలు రాజకీయ పార్టీల నేతలు, వాటి అనుబంధ సంఘాల నేతలు తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలని చూడటం ఖండించదగ్గ అంశమని అన్నారు. ఈరోజు గురుకులాలలో ఉన్నటువంటి చిన్న చిన్న అంశాలు 20సంవత్సరాలుగా ఉన్నవేనని గుర్తు చేశారు. ఈ అంశాలు గతంలో ఎప్పుడూ జరగనట్టుగా కొన్ని రాజకీయ పార్టీలు వాడుకోవడం మంచిది కాదన్నారు. ఈ వ్యవస్థపై పూర్తి అవగాహన కలిగిన నేతలు సమస్యను పక్కదారి పట్టిస్తూ ప్రభుత్వాన్ని, ఇందులో పనిచేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగవర్గాన్ని దోషులుగా చిత్రీకరించడం సమంజసమం కాదని చెప్పారు. నేతల రాజకీయాల వల్ల 30వేల మంది ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గం తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి నారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మధుసూదన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జనార్దన్, ఎస్‌డబ్ల్యూ యూనిట్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, ప్రధాన కార్యదర్శి గణేష్, ఉపాధ్యక్షుడు బిక్షంయాదవ్ పాల్గొన్నారు.


శివచరణ్ ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సీఎంను కలిసిన శివచరణ్‌రెడ్డి

మన్సూరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ ఎన్నికల ఫలితాల్లో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా మన్సూరాబాద్‌కు చెందిన జక్కిడి శివచరణ్‌రెడ్డి శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. అదేవిధంగా ఎన్నికల్లో గెలుపొందిన యూత్ కాంగ్రెస్ కమిటీని సీఎంకు పరిచ యం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ఆరు గ్యారెంటీల అమలుపై శివచరణ్ ప్రచురించిన పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా శివచరణ్‌రెడ్డిని సీఎం శాలువాతో సత్కరించి అభినందించారు.



గిరికి అవార్డు అందజేస్తున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

'మాతృ దేవోభవ' గిరికి మరో అవార్డు

సరూర్‌నగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల మాతృ దేవోభవ అనాథాశ్రమం నిర్వాహకుడు గట్టు గిరిని మరో అవార్డు వరించింది. అభాగ్యులకు ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా హేవెన్ హోమ్స్ సొసైటీ తన 20వ వార్షికోత్సవం సందర్భంగా గిరికి సేవా భారత్-2024 అవార్డును ప్రకటించింది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి నగరంలోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పాల్గొని గిరికి అవార్డు అందజేశారు. అనాథలకు, అభాగ్యులకు గిరి చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. తనకు ఇది 182వ అవార్డుగా గిరి పేర్కొన్నారు. అవార్డులు తన బాధ్యతను మరింత పెంచుతున్నాయని, జీవితాంతం అభాగ్యులకు సేవ చేసుకుంటానని ఆయన అన్నారు. కార్యక్రమంలో గిరి సతీమణి ఇందిర, పలువురు అతిథులు, హేవెన్ హోమ్స్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏసీ బస్సు చార్జీల్లో 10శాతం తగ్గింపు అమల్లోకి

చాదర్‌ఘాట్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అన్ని రకాల ఏసీ బస్సుల్లో చార్జీలపై 10శాతం తగ్గింపు అమలులోకి వచ్చిందని రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత తెలిపారు. శుక్రవారం నుంచి అమలులోకి వచ్చిన ఏసీ బస్సు చార్జీల 10శాతం తగ్గింపు ఈనెలాఖరు వరకు కొనసాగుతుందని వివరించారు. ప్రస్తుత శీతాకాలంలో ఏసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులను ఆకట్టుకోవడానికి ఆర్టీసీ ఈ మేరకు చార్జీల్లో తగ్గింపు ప్రకటించిందని ఆమె వివరించారు. అన్ని ఏసీ బస్సులైన ఏసీ స్లీపర్, ఏసీ సీటర్, స్లీపర్, రాజధాని బస్సుల్లోని చార్జీల్లో ఈ తగ్గింపు వర్తిస్తుందని రీజినల్ మేనేజర్ ప్రకటించారు. ప్రయాణికులకు ఉన్నతస్థాయి ప్రయాణాన్ని అందుబాటులోకి ఉంచడంతో పాటు సౌకర్యవంతంగా చేసే లక్ష్యంగా ఆఫర్ ప్రవేశపెట్టినట్లు ఆమె తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఆర్టీసీ వెబ్‌సైట్ సందర్శించాలని సూచించారు.